క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

రామగుండం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్గాం మండల పరిధిలోని విలేజి అంతర్గాం, టీటీఎస్ అంతర్గాం, రాయదండి, పెద్దంపేట గ్రామాల్లో మొబైల్ వ్యాన్‌తో సోమవారం ఎల్రక్టానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లో ఓటువేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్ రావు, మొబైల్ డెమాన్‌స్ట్రేషన్ వ్యాన్ ఇన్‌చార్జి బి.శశిధర్, ఏఎస్సై గౌస్‌ఖాన్, అంగన్‌వాడీలు, తదితరులున్నారు.

రద్దయిన రైళ్లను యథావిధిగా నడపాలి

ఓదెల: రామగిరి, సింగరేణి రైళ్లను యథావిధిగా నడిపాలని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దొడ్డె స్వామి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొలనూర్‌లో మాట్లాడారు. మూడో లైన్ మరమ్మతుల పేరిట రైల్వే శాఖ సింగరేణి, రామగిరి రైళ్లను రద్దుచేయటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భద్రాచలం నుంచి సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్యలో నడిచే సింగరేణి రైలు, కాజీపేట్ నుంచి బల్లార్షా మధ్య నడిచే రామగిరి రైళ్లను రద్దు చేయడంతో సింగరేణి కార్మికులు, రైతులు, విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాయకులు రమేశ్, శ్రీనివాస్, ప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే 'గృహలక్ష్మి'

రామగుండం: ప్రజలను మభ్యపెట్టేందుకే గృహలక్ష్మి పథకం పేరుతో ప్రభుత్వం నాటకానికి తెరలేపిందని, దరఖాస్తు చేసుకునేందుకు కేవలం రెండ్రోజుల గడువు పెట్టడం సరికాదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఎస్పీ ప్రతినిధులు ప్లకార్డులతో నిరసన తెలిపి అనంతరం తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. సొంతస్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు చెల్లిస్తామనడం ప్రభుత్వ మోసపూరిత విధానమేనన్నారు. బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజనర్సయ్య, చిలుక రామ్మూర్తి, సిరికొండ సది, రమేశ్, నారాయణ, జాన్, నాగరాజు, రమేశ్ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కమాన్‌పూర్: మండలకేంద్రంలోని బాపూజీనగర్‌కు చెందిన అనుముల రాజేశ్వరికి మంజూరైన రూ.21వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు, ఉపాధ్యక్షుడు బాద్రపు శంకర్, నాయకులు రంగు సత్యనారాయణ, కుందారపు బాపు, పిడుగు శంకర్, గుమ్మడి సతీశ్, రఫీక్, పెండ్యాల రాజు, బూస తిరుపతి, తదితరులున్నారు.

గొర్రెల యూనిట్లు మంజూరు



మల్లేశ్

కమాన్‌పూర్: రామగిరి మండలం రత్నాపూర్‌కు చెందిన గొర్రెల కాపరులకు ప్రభుత్వం సబ్సిడీపై అందించే 12 యూనిట్లు మంజూరైనట్లు సర్పంచ్ పల్లె ప్రతిమ తెలిపారు. రెండో విడతలో 72 మంది లబ్ధిదారులకు సబ్సిడీ గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు డీడీలు చెల్లించగా ఇప్పటి వరకు 24 మందికి యూనిట్లు పంపిణీ చేశారు.

కార్యవర్గ సమావేశం

కోల్‌సిటీ: రామగుండం ఏరియా న్యూస్ పేపర్ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గోదావరిఖనిలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి పంజ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో న్యూస్ పేపర్ ఏజెంట్లకు వర్తింపజేయాలని, గ్రామీణ ప్రాంత ఏజెంట్ల కింద పేపర్ బాయ్‌లకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజు, సదానందం తదితరులున్నారు.

నియామకం

కమాన్‌పూర్: రామగిరి మండల బీఎస్పీ అధ్యక్షుడిగా సింగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రేణుకుంట్ల మల్లేశ్‌ను నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి జనగామ రవికుమార్ సోమవారం తెలిపా రు. తనపై నమ్మకంతో మండల శాఖ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మల్లేశ్ తెలిపారు.

ఓదెలలో నేత కార్మికుల దినోత్సవం

ఓదెల: ఓదెలలో జాతీయ నేతకార్మికుల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండలకేంద్రంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపుతో పద్మశాలీలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం నేత కార్మికులను ఆదుకోవాలన్నారు. జిల్లా నాయకులు చీకట్ల మొండయ్య, మండల అధ్యక్షుడు పర్శ రమేశ్, నాయకులు పాల్గొన్నారు.



తారు.. లేచిపోతోంది సారూ

రోడ్డుపై తారుపోసే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం.. పూతలుగా పోసి మమ అనిపించడంతో వర్షాలకు లేచిపోయింది. సుల్తానాబాద్‌లోని బస్టాండ్ వద్ద, అంబేద్కర్ చౌరస్తా వద్ద ఇలా ప్రధాన రహదారిపై తారు లేచి గుంతలతో ప్రయాణికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అధికారులు కాస్త దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

గూన ఇళ్లు.. అందమే వేరు



మేడలు, అద్దాల భవంతులు, ఎత్తయిన అపార్ట్‌మెంట్స్ వెలుస్తున్నా.. గూనతో కప్పిన ఇల్లు తన గొప్పతనాన్ని చెప్పకనే చెప్తుంది. పచ్చటి తివాచీ పరుచుకుని అందులో కొలువైన ఈ అందాల గృహం కనులకింపుగా కనిపిస్తోంది. సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి గ్రామ శివారులో సాక్షి కెమెరాకు కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

తహసీల్దార్‌ను నియమించాలి

కమాన్‌పూర్: మండల తహసీల్దార్‌ను నియమించకపోవడంతో వారంరోజుల నుంచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైనాల రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే గృహలక్ష్మి పథకానికి లబ్ధిదారులు సర్టిఫికెట్లుతో పాటు భూ రిజిస్ట్రేషన్‌లకు స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని లేకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అందోళన చేపడుతామన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు బాద్రపు శంకర్, నాయకులు రంగు సత్యనారాయణ, కుందారపు బాపు, గుమ్మడి సతీష్, రఫీక్, పిడుగు శంకర్, బూస తిరుపతి, రాజు, శేఖర్, రాయమల్లులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



రాస్తారోకో చేస్తున్న పంచాయతీ కార్మికులు



నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ఓదెల: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో పంచాయతీ కార్మికులు సోమవారం రాస్తారోకో చేశారు. పోలీసులు రాస్తారోకోను విరమింపచేశారు. ఇక్కడ కార్మికులు నాగయ్య, బ్రహ్మాచారి, రంజిత్, నరేశ్, కుమార్, శ్రీనివాస్, లు పాల్గొన్నారు.

బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద

పాలకుర్తి: బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద ఫోర్‌లైన్ రహదారిపై జీపీ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. నెలరోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కార్మికులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బసంత్‌నగర్ రెండో ఎస్సై గంగరాజ గౌడ్ చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. బూడిద రామస్వామి, కట్ల స్వామి, అశోక్, బూడిద కారంతి, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు దీక్షా శిబిరంలో జీపీ కార్మికులు నిరసన తెలిపారు. కార్మికులు సంపత్‌కుమార్, బాణయ్య, మల్లెత్తుల అంజనేయులు, పుట్ట మల్లేశం, బడుగు అనిల్, అజయ్, భాస్కర్ పేలిపాక శంకర్, వెంకటేశ్, లచ్చయ్య, మధు తదితరులున్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జీపీ కార్మికుల నిరసన చేపట్టారు. డిమాండ్లు పరిష్కరించే వరకు దీక్షలు చేపడుతామని యూనియన్ మండల అధ్యక్షుడు గట్టయ్య అన్నారు. నాయకులు రాజబాబు, సంపత్, రామస్వామి, సురేశ్, అంజి, మధునయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే ప్రధాన లక్ష్యం



కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మమతా రెడ్డి

పెద్దపల్లి రూరల్: పట్టణ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చైర్‌పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి అన్నారు. సోమవారం 20వ వార్డులో రూ.2లక్షల సాధారణ నిధుల ద్వారా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను కౌన్సిలర్ రెవెల్లి స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహకారంతో వార్డుల్లో 80 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. పెండింగ్ పనులను పూర్తి చేస్తామని, మిషన్ భగీరథ నీటిని ఇంటింటికీ అందించేందుకు ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నూర్జహాన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వాణి, ప్రజలు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

కమాన్‌పూర్/జూలపల్లి/ధర్మారం : పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గంలో సోమవారం చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నా ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఎదుట నిరసన వ్యక్తంచేశారు. రూ.21 వేల వేతనాలు, అర్హులైన వారిని ఏఎన్‌ఎంలుగా తీసుకోవాలని, ఉద్యోగ భద్రత, వారసత్వ ఉద్యోగం, ఆరోగ్య బీమా పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమపై ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి చూపుతోందని ఆరోపించారు. అనంతరం వైద్యాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి



బీపీ మండల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: మండల కమిషన్ సిఫార్సులను అమలు చేయాలనే డిమాండ్‌తో మండల్ డేను జరుపుకుంటున్నట్లు జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మండల్ డే సందర్భంగా సోమవారం మంథనిలోని బీపీ మండల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల్ కమిషన్ సూచించిన 40 సిఫార్సుల్లో ఒకటైన బీసీలకు కేంద్రప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఏటా ఆగస్టు 7న మండల్ డే జరుపుకుంటున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ కుమార్, ఎంపీపీ శంకర్, జెడ్పీటీసీ సభ్యురాలు సుమలత ఉన్నారు.

గద్దర్‌కు నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న కళాకారులు



నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గోదావరిఖని: ప్రజాకవి, గాయకుడు గద్దర్‌కు గోదావరిఖని సాంస్కృతిక సారధి కళాకారులు సోమవారం నివాళి అర్పించారు. కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించి ఆయన ఫ్లెక్సీ వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కళాకారులు ఈదునూరి పద్మ, జనగామ రాజనర్సు, వడ్కాపురం రవికుమార్, రమ, రవీందర్, స్వప్న, స్పందన, శ్వేత, రాజేశ్వరి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ప్రజాసంఘాల నాయకులు కొవొత్తులతో గద్దర్‌కు ఘన నివాళి అర్పించారు. నాయకులు ఎంపీటీసీ దండె వెంకటేశం, కొప్పుల మహేశ్, మానుమండ్ల శ్రీనివాస్, సీపెల్లి అంజయ్య, సంపత్, దస్తాగిరి తదితరులున్నారు.

అంతర్గాంలో..

రామగుండం: అంతర్గాం మండలకేంద్రంలో జీపీ కార్మికులు పంచాయతీ కార్మికులు రాస్తారోకో చేశారు. పంచాయతీ కార్మికులు తూడూరి శ్రీనివాస్, మాలెం సురేశ్, రాపోలు విద్యాకర్‌రావు, సీపీఎం నాయకులు అడారి నర్సింగరావు తదితరులున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలన



మాట్లాడుతున్న నాయకులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని పోచమ్మ దేవాలయం పక్కన 2013లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ నాయకులు మద్దెల దినేశ్ ఆరోపించారు. సోమవారం షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన ఆయన పాలకులు, అధికారులు పనితీరుపై విమర్శలు చేశారు. రూ.7కోట్లు నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, ఉపయోగంలోకి రాకుండా మరో రూ.5కోట్ల వ్యయంతో మరో అంతస్తు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా సబ్ రిజిస్టర్ కార్యాలయం, పోస్టాఫీస్, అర్బన్ తహసీల్దార్, ఎంఈవో కార్యాలయం, పాస్‌పోర్ట్ కార్యాలయాలు మరికొన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడ నరేందర్, బూడిద హర్ష, వెంకటేశ్, శ్రీనివాస్, రాజేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

పెద్దపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్ల వేతనాలు నెలకు రూ.21 వేలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర సమితి కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కట్కూరి శ్రీనివాసరెడ్డి జిల్లా వైద్యధికారికి సోమవారం వినతి పత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా జిల్లా వ్యాప్తంగా 509 మంది ఆశా కార్యకర్తలు సేవలందిస్తున్నారన్నారు.

ఉద్యమాలతోనే హక్కుల సాధన

రామగుండం: మిలిటెంట్ ఉద్యమాలతోనే బలహీన వర్గాల ప్రజల హక్కులు సాధించుకుంటారని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ అన్నారు. సోమవారం ఢిల్లీ వెళ్లేందుకు బీసీ ప్రతినిధులు రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకొని బీసీల ఐక్యతపై నినాదాలు చేశారు. మంగళవారం పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని బీసీలు విజయవంతం చేసి బీసీల ఐక్యతను దేశ రాజధానిలో చాటి చెప్పాలన్నారు. ఢిల్లీకి తరలిన వారిలో బీసీ ప్రతినిధులు వింజమూరి సురేశ్, చప్పరి సంతోష్, ప్రశాంత్, రమేశ్, సుగుణాకర్ తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి, ముర్మూర్, గోలివాడ, విలేజి అంతర్గాం, టీటీఎస్ అంతర్గాం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను అంతర్గాం తహసీల్దార్ పి.రామ్మోహన్‌రావు సందర్శించారు. కనీస వసతులు నీరు, విద్యుత్, వికలాంగులకు ర్యాంపు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేందర్‌రెడ్డి, శ్రీధర్ తదితరులున్నారు.

పుష్పగుచ్ఛం అందజేత

ఎలిగేడు: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన స్వర్ణను బీఆర్‌ఎస్ యూత్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కప్పల ప్రవీణ్ , వాల్మీకి బోయ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుడుగుల మహేందర్, నాయకులు పొన్నాల అనిల్, పిట్టల నరేశ్, మండల శ్రీశైలం, నగేశ్, సుమన్, మధు, రాజ్‌కుమార్, గణేశ్, గౌతమ్, నంద, అజయ్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

మంథని: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు. సోమవారం మంథని ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కమిటీ ఎన్నిక



జ్యోతినగర్: ఎన్టీపీసీ పట్టణ రియల్ కన్సల్టెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధి 2, 3, 4, 5, 23 డివిజన్ల పరిధిలోని రియల్టర్స్ సభ్యుల సమావేశం సోమవారం జరిగింది. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నడిపెల్లి అభిషేక్ రావు, అధ్యక్షుడిగా దబ్బెట కమలాకర్, ఉపాధ్యక్షుడిగా పొన్నం విజయ్ గౌడ్, బోషల్ల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా బండి అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా బొడిగ భరత్ గౌడ్, కోశాధికారిగా వేముల సతీశ్, రెడ్డి, ముఖ్య సలహాదారులుగా మేకల నారాయణ, గౌరవ సలహాదారుడిగా బుచ్చయ్య, ప్రచార కార్యదర్శిగా కంది కుమార్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో 60 మంది రియల్టర్స్ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



గర్భిణులకు చీరె, సారె అందజేస్తున్న సీడీపీఓ

మంథని/పెద్దపల్లి రూరల్/సుల్తానాబాద్/ కోల్‌సిటీ/ ఫెర్టిలైజర్ సిటీ/ రామగుండం: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని సీడీపీవో స్వరూపరాణి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పెద్దపల్లి నియోజకవర్గంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ముర్మూర్‌లో గర్భిణులు, బాలింతలకు చీరె, సారె, పసుపు, కుంకుమ అందజేశారు. ఆయా మండలాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం అందించాలన్నారు.

వరద బాధిత కుటుంబాలకు చేయూత



విద్యార్థులు సేకరించిన బియ్యం

కమాన్‌పూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి వరద బాధితుల కోసం రామగిరి మండలం కల్వచర్ల ప్రగతి పాఠశాలకు చెందిన విద్యార్థులు సేకరించిన పది క్వింటాళ్ల బియ్యాన్ని సోమవారం ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి గ్రామానికి పంపించారు. కల్వచర్ల సర్పంచ్ పద్మ, పాఠశాల కరస్పాండెంట్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



గాలికుంటు వ్యాధి టీకా వేస్తున్న సర్పంచ్

ఎలిగేడు: పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, మండల పశువైద్యాధికారిణి ఝాన్సీ అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. గ్రామంలోని 252 ఆవులు, గేదెలకు గాలికుంటు టీకాలు వేసినట్లు తెలిపారు. 252 పశువులకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూర్ల సింధూజ, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వచర్లలో..

కమాన్‌పూర్: రామగిరి మండలం కల్వచర్లలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. శిబిరాన్ని సర్పంచ్ గంట పద్మ ప్రారంభించారు. రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలన్నారు. ఎంపీటీసీ కొట్టె సందీప్, ఉపసర్పంచ్ వేము కనుకయ్య, పశు వైద్యాధికారి దుర్గా ప్రసాద్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డి, సిబ్బంది అత్తె మల్లికార్జున్, నారాయణ పాల్గొన్నారు.

10లోగా దరఖాస్తు చేసుకోవాలి

రామగుండం: ఈనెల 10వ తేదీలోగా ఇంటిస్థలం ఉండి అర్హులైన వారు గృహలక్ష్మి పథకానికి సత్వరమే దరఖాస్తు చేసుకోవాలని అంతర్గాం తహసీల్దార్ పి.రామ్మోహన్‌రావు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి సూచనలు, సలహాలిచ్చారు. దరఖాస్తు చేసుకునేవారు ఆధార్‌కార్డు, తెలుపు రేషన్‌కార్డు, కులం, నివాస, వికలాంగులైతే సదరం ధ్రువీకరణపత్రాలను అందించాలన్నారు.

మంథని: ఈనెల 10 లోగా గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ కోరారు. మున్సిపాలిటీ, మండల పరిషత్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

'గృహలక్ష్మి' గడువు తేదీ పెంచాలి

పెద్దపల్లి రూరల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెల్లంపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. ఇంటి స్థలం ఉన్న ప్రతి నిరుపేదకు రూ.5 లక్షల ఇస్తామన్న సీఎం రూ.3లక్షలకు తగ్గించి ఇస్తామని ప్రకటించి, హడావుడిగా గృహలక్ష్మి పేరుతో దరఖాస్తు చేసుకోవాలనడం సరికాదన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్

జూలపల్లి: 'గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎండీ బషీరొద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఇంతకుముందు ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వివరాలు ఉండాలన్నారు. ఈనెల 10 వరకు దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లో అందించాలన్నారు.

పాలకుర్తి: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు తహసీల్దార్ జ్యోతికి దరఖాస్తులు అందజేశారు. మండలవ్యాప్తంగా ఒక్కరోజే 110 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.